

# విందు

—మారేమండ సీతారామయ్య

**ఆ** వార్తని ప్రపంచం కోడై కూసింది.

**అసలు తమాషా అంతా అందులోనే ఉంది. ప్రపంచం చెవుల పిల్లో, వేట కుక్కో, అదురుకొట్టే ఏ పందికొక్కో అయి కూస్తే ఫరవాలేదు. కాని, బొత్తిగా కోడై కూసింది.** భూగోళకారులు పరీక్షించి, దృఢపరిచి, చరిత్రకారుల చేత చెరగని ఇంకుతో చెదలు పట్టని పుస్తకంలో గుండ్రంగా ఉందని వ్రాయించిన ప్రపంచం కోడై చెవులు చిల్లులు పడేలా మరీ కూసింది. ఆ కోడైనా ఉత్త కోడిలా కాదు. చరిత్ర పుటల్లో గొప్ప పీఠం మీద బాసింపట్టు వేసుకుని బెట్టుచేసినా కదలని బొబ్బిలి కోడి పందాల కోడిలా కూసింది. ఇంత గొప్ప కోడి కూసిన ఆ వార్త మరింత గొప్పదవుతుందనడంలో సందేహం లేదు. ఆ వార్త సారాంశం ఇది:

మా ఊరి ఛైర్మన్ కోటేశ్వర్రావు గారు ఊరంతటికి విందు చేస్తారట. అదీ మామూలు విందుకాదు. మా ఊరి చరిత్రలో ఇంతవరకూ ఎవరూ చెయ్యనంతటి ఘనమైన విందు.

పాతిక సంవత్సరాల క్రిందట పదేళ్ల కుర్రాడుగా పిగిలిన గుడ్డలు ఒంటికి చుట్టుకుని, చిరిగిన తాటాకు బుట్టలో కుళ్లిన మామిడిపండ్లు పెట్టుకుని గుడిసెలు లగాయితు అంతస్తులవరకు ఎక్కిన మెట్టు తొక్కకుండా అమ్ముతూ తన జీవన యాత్ర ప్రారంభించి అందరి అభిమానానికి పాత్రుడైన కోటేశు ఉరఫ్ కోటేశ్వర్రావు క్రమ పద్ధతిలో అంచె అంచెలుగా నిచ్చెన లెక్క ఇరవై సంవత్సరాల్లో కట్టెలమ్మిన కోనలో ఏ గంపలోనూ పట్టనన్ని పువ్వులు టోకున అమ్మి కడకో విందు చెయ్యబూనటం 'ఆఁ! నిజం?' అని ఆశ్చర్యపడిపోయేటంతటి పెద్ద విషయంగానే చెప్పవచ్చు. ఎందుకంటే కోటేశ్వర్రావుగారిది ఎంగిలి ఎడంచేత్తో, ముంగిట నిలుచున్న ఏ వ్యక్తిని కూడా పొరపాటుగా చెయ్యి ఊపి 'లేదు పొ'మ్మనే బంగారు పలుకుల స్వభావం కాదు కాబట్టే. ఆయన సాధించిన అభివృద్ధికి పట్టుగొమ్మ అంటూ ప్రిన్సిపుల్ ఈ స్వభావంలోనే ఉందని

**ప్రతి పని వెనుకా ఒక స్వార్థం, అది నెరవేరడానికి తగిన కార్యక్రమం ఉండి ఉంటుంది. ప్రతి జీవికీ ఓ ఎదురు ప్రతిజీవి ఉంటుంది. కొండంత గొప్పతనం వెనుక సంవత్సరాల తరబడి ఒళ్లు అమ్ముకున్న అరవ చాకిరి కృషి ఫలితం ఉంటుంది ఎంతటి తిరుగులేని అధికారం చేతుల్లో ఉన్నా కొన్ని సమయాల్లో కొన్ని కొన్ని విషయాల్లో లొంగుబాటు అవసరమేమో?**

ఆయనే చాలాసార్లు అంతరంగికుల్తో వివరించారు. కోటేశ్వరరావుగారి గొప్పతనానికి మా మ్యునిసిపల్ ఆఫీసు కున్నంత బలమైన పునాది ఉంది. మ్యునిసిపల్ ఆఫీసుకూ, ఆయనకూ క్రిందటి పదేళ్ల నించి ఉన్నంత, పెంపొందుతున్నంత అవినాభావ సంబంధం కూడా ఉంది.

భర్తృహరి మనుష్యుల్ని నాలుగు రకాలుగా తెగ్గొట్టి ఒక్కొక్క తెగకి ఒక్కో బోర్డు దిగ్గొట్టి పట్టినంత పుణ్యాన్ని మూట కట్టుకుని చక్కా పోయాడు. ఆయన వదిలిన పద్య మూటలో మొదటి రకం మనుష్యులు పరుల పనులకోసం తమని త్యాగం చేసుకుంటారు. రెండో రకం పరుల పనులతో పాటు తమ పనులు చక్కబెట్టుకుంటారు. మూడో రకం తమ అవసరాలకోసం పరాయివాళ్ళని గోదావరి స్నానం చేయిస్తారు. క్లాస్ ఫోర్ కేటగిరిలో పిల్లితల గొరిగేవాళ్ళు చేరతారు. నీతి, నియమం, న్యాయం, ధర్మం లాంటి పదాలు ఎన్నికల్లో, సభల్లో, పది మందిలో మాట్లాడేటప్పుడు తప్ప నిత్య జీవితంలో ఆచరించేందుకు తగవనే సత్యాన్ని గాఢంగా నమ్మిన చైర్మన్ గారు తన పదహారో ఏట నించి భర్తృహరి సెకండ్‌క్లాసు కంపార్టుమెంటులో టిక్కెట్టు రిజర్వు చేసుకున్నారు.

పంచాయితీగా బ్రతికే మా ఊరు మ్యునిసిపాలిటీగా రూపొందింది. కంట్రాక్టరుగా వెలిగే కోటేశ్వరరావుగారు కె. ఎస్. రావుగా మారి మ్యునిసిపాలిటీ చైర్మన్‌గా ఉద్భవించి చెయ్యెత్తి దీవించే రామభద్రుడిలా మా ఊరి అభివృద్ధికి అభయహస్త మిచ్చేశారు. అక్కడి నించి ప్రారంభమైంది ఆయన దేశసేవ. మ్యునిసిపల్ ఆఫీసుకు ధవళేశ్వరంవద్ద కాటన్‌దొర కట్టించినంత స్ట్రాంగ్‌గా ఓ బిల్డింగు కట్టించారు. ఆఫీసు కట్టగా మిగిల్చిన సిమెంటు, కలప లాంటి సాపు దినుసులతో దాని కెదురుగా తన కో పదిహేను గదుల ఆధునాతనమైన కొంప అనబడు 'కోటేశు నిలయం' కట్టించుకున్నారు. ఇంటి వెనక ఊరి కో కొళాయి చెరువు తవ్వించారు. తన మేడ బయట స్విమ్మింగ్ పూల్, లోపల బాత్‌రూములు అమర్చుకున్నారు. ఊరంతటికి రేకులతో లేవటరీలు భారీఎత్తున కట్టించారు. తన బిల్డింగు కో మూడు సెప్టిక్ దొడ్లు చిన్న సైజువి కట్టించుకున్నారు. క్రమేపి ఊరికి పబ్లిక్ లైబ్రరీ, తన కో రీడింగ్ రూమూ, ఊరికి గెస్టుహౌసూ, తనకి డ్రాయింగురూమూ, ఊరికి టౌనుహాలూ, తనకి డ్రెస్సింగు రూమూ ఏర్పాటుచేసి భక్తిగా పట్టణ సేవ చేశారు. ఇన్ని చేసినా ఆయన ఊరి సేవా దాహం తీరలేదు. ఊరికి ఉత్తరంగా పంతై బెడ్లతో బ్రహ్మాండమైన హాస్పిటల్ కట్టించి, ప్రసిద్ధి చెందిన బావమరిది గారి దత్తుడిని ఆ హాస్పిటల్ డాక్టరుగా వేయించి, చెల్లెలుగారి కొడుకుచేత దాని కెదురుగా మందుల షాపు పెట్టించారు. భావి భారత పౌరుల్ని మాన్యుఫాక్చర్ చేసే ఓ కాలేజీని, ఓ కీర్తిశేషుడి పేరిట పచ్చగడ్డి పార్కును, నాటకాలు, మీటింగులు, వీధి భాగవతాలు లాంటి ఎక్స్‌ట్రాకరిక్యులర్ ఏక్టివిటీస్‌కు ఓ ఓపెన్ ఎయిర్ డయాసు నిర్మించారు. అప్పటి నుంచి ఆయన బ్యాంక్ బాలెన్స్ అమలాపురం కోనసీమ కొబ్బరి చెట్టులా తలలాడుతూ జర్రుమని నేలమీద పాకే తెర్రిపోతులా ఎదగటం మొదలు పెట్టింది. గత సంవత్సరం రాష్ట్ర రాజధాని చుట్టూ కాళ్లరిగేలా ప్రదక్షిణాలు చేసి ఓ ఓవర్ బ్రిడ్జికి కోటా కేటాయింపు చేసుకుని దాని నిర్మాణ, నిర్వాహణ బాధ్యతను నిర్వర్తించే అధికారాన్ని పాట పాడేసుకుని, ఎరువుల మంత్రిగారిచేత పునాదిరాయి పాతేయించి ఎరువుల దుకాణం తెరిచారు. రాత్రింబవళ్లు కష్టపడి ఆరు నెలల్లో అది పూర్తి చేయించి చీఫ్ మినిస్టర్‌గారి చేత రిబ్బను కత్తిరింప జేశారు. ఇవన్నీ ఆయన సాధించిన గొప్ప పనుల్లో కొన్ని మైలురాళ్లు. ఇవి కాకుండా ఇంకా బ్రౌన్ దొరగారి నిఘంటువులో మాట లన్ని మైనర్ రాళ్లు, మడిరాళ్లు ఉన్నాయి.

ఇన్ని పనులు సాధించటం ఒకరివల్ల సాధ్యం కాదు. మానవుడు సంఘజీవి. అందుకే చైర్మన్ గారు తనకు తోడుగా ఇద్దరు నమ్మినబంట్లను పెంచుకుంటున్నారు. వాళ్లు భూషణం, శేషేంద్రం. వాళ్లు ఊరికి పులులు. కోటేశ్వరరావు గారి ముంగిట పిల్లులు. సినిమాలో చూపినట్టు వాళ్లు చారెడేసి గళ్ల లుంగీల మీద మానెలో ముంచి వానేసి తగలేసినా చెక్కుచెదరని ఎర్ర రంగు బనియనులతో, అరచెయ్యి సైజు జేమ్సు బాండ్ బెల్టులతో, జబ్బ మట్టూ బిగించి కట్టిన కాశీతాడు, నానిలో గుచ్చిన ఆంజనేయస్వామి తాయెత్తుల్తో ప్రత్యక్షం కారు. గజెటెడ్ ఆఫీసర్లంత నీటుగా ఉంటారు. వారి కంటే తియ్యగానూ మాట్లాడుతారు. కాని, రాత్రి పెర్విసియా వెలుగులో ఉంచి ఒక్క క్షణం స్విచ్చి ఆఫ్ చేస్తే అద్రెమ్మ గల్లంతయ్యే తరిచ్చాయి. దాని కెవరూ ఏం చెయ్యలేరు. అది భగవత్ ప్రసాదం. కృష్ణుడికే తప్పలేదు! భూషణం, శేషేంద్రం కోటేశ్వరరావుగారికి ఎందుకోనూ తీసిపోరు. పైపెచ్చు కొన్ని విషయాల్లో అంతకంటె ఘనులు. కాని, ఎన్ని సంవత్సరాలైనా ఆయన ముందు పిల్లులు. మనుషుల బలహీనతల్ని పసిగట్టి వాట్నిమీద దెబ్బ తీస్తే మనిషి బానిస అవుతాడు. బలహీనతలకి తప్ని బలిగా అర్పించుకుంటాడు. అందువల్లే దుర్యోధనుడు దెబ్బ తిన్నాడు. జరాసంధుడు రెండు హాఫ్ లయ్యాడు. బకాసురుడు బంగాళాదుంప కూర అయ్యాడు. కీచకుడు పీచుమన్నాడు. భీముడు అజేయుడుగా మిగిలిపోయాడు. ఇవి భారతం నేర్పిన నీతి పాఠాలు. సదరు రాజకీయ పాఠాల్ని, ఉపదేశాల్ని తనలో జీర్ణించుకుని కోటేశ్వరరావుగారు భూషణం, శేషేంద్రంమీద ఆధిక్యం సంపాదించుకోగలిగారు. సంపాదించుకుని వారిని అదిమి ఉంచుకున్నారు.

ఒక ఎత్తుకు చేరిన తరవాత మోసం కంటే యుక్తి పెద్ద పాత్ర తీసుకుంటుంది. బలంకంటే సమయస్ఫూర్తి రాణిస్తుంది. డబ్బుకంటే ఆప్యాయత ముందడుగు వేస్తుంది. నిర్వాహణ కంటే చతురత, వాకచక్యం లీడ్ చేస్తాయి. నాలుగు గోడల మధ్య బంధిస్తే పిరికి జీవైనా పెరిగి గుడ్లను పీకుతుంది. అణగద్రొక్కాలని ప్రయత్నిస్తే నామరూపాల్లేకుండా చెయ్యటానికి ఎదురు తిరుగుతుంది. ఈ విషయాల్ని కూడా కోటేశ్వరరావుగారు అనుభవం మీద తెలుసుకున్నారు. అందుకే భూషణం, శేషేంద్రంలకు ఏ లోటూ రాకుండా తను పెరుగుతూ వాళ్లని పెంచాడు. తను ఎదుగుతూ వాళ్లకి నిచ్చెన లిచ్చాడు. కాని, మర్రిచెట్టు నీడలో పెరిగే చిల్లర మొక్కలు ఎంత కాలమైనా మర్రిచెట్టంత విశాలతని, ఎత్తును సంతరించుకోలేవు. అందుకే భూషణం, శేషేంద్రం కోటేశ్వరరావు

( తరువాయి 38 వ పేజీలో )



# విందు
## ( 35 వ పేజీ తరువాయి)



గారి కొలువులో శాశ్వతంగా ఉండిపోయారు. కోటేశ్వరరావు గారి ఇంట్లో ఏం జరిగినా భూషణం, శేషేంద్రంల చేతుల మీదుగా జరుగుతుంది. వాళ్ళ చిన్న చిన్న కన్నుసైగలతో పెద్ద పెద్ద పనులు సునాయాసంగా చక్కబెడతారు. ప్రస్తుతం విందు ఆహ్వానాలు పంచటం, దానికి కావలసిన ఏర్పాట్లు చెయ్యటంలో క్షణం తీరిక లేకుండా ఉన్నారు.

ప్రతి జీవికీ ఓ ఎదురు ప్రతిజీవి ఉంటుంది. కొండంత గొప్పతనం వెనక సంవత్సరాల తరబడి ఒళ్ళు అమ్ముకున్న అరవ చాకిరీ కృషి ఫలితం ఉంటుంది. ఏ డాక్టరుకైనా జీవితంలోనే సంపాదించుకునే స్వర్ణయుగం వసంతంలా మూడు నాలుగేళ్లు ఉండి తరవాత ప్రాక్టీసు పడిపోతుంది. ఎంతటి తిరుగులేని అధికారం చేతుల్లో ఉన్నా కొన్ని సమయాల్లో, కొన్ని విషయాల్లో లొంగుబాటుతనం అవసర మవుతుంది. కోటేశ్వరరావుగారికి ఈమధ్య అటువంటి ప్రమాదమే దాపరించింది. మా ఊళ్లో కొళాయి చెరువంతటి చెరువులు కొళాయి చెరువుతో కలిపి ఓ డజనున్నాయి. ఆ డజను చెరువుల్లో పుష్కలంగా ఆరోగ్యంగా పెరిగిన రుచికరమైన చేపలు ఉన్నాయి. అవి మ్యునిసిపాలిటీ సొత్తు. సదరు చేపల్ని పట్టుకునే అధికారం పాటకు పెట్టడం ఇష్టంలేని ఛెయిర్మన్ గారు కొన్ని రాజకీయ కారణాల వల్ల వేలాని కంగీకరించి లక్ష రూపాయలు కోల్పోయారు. ఆ చేపలు పట్టుకునే అధికారం మరో ఆసామి హస్తగతమైంది. ఆయన రాజకీయ చరిత్రలో ఇది మొదటి దెబ్బ. దెబ్బ గాయం కాదు. అందుకే కోటేశ్వరరావుగారు దీన్ని అపజయంగా భావించలేదు. ఆయన అవిశ్వాస తీర్మానానికి కూడా జడవని ధీరుడు. గద్దె దిగని మహానుభావుడు. అందుకే ఈ విషయాన్ని ఆయన స్పోర్టివ్ స్పిరిట్‌తో చిరునవ్వు నవ్వుతూ ఎదుర్కొన్నారు.

విందు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

మనిషి మనిషికి ఆహ్వానాలు పంచబడ్డాయి. బాంకులో పదహారు లక్షలు వివిధ పనులకు లోను తీసుకుని ఐ. పి. పెట్టి కాగితాల మీద బికారిగా మిగిలిపోయిన సొనకాలు, ఆవేశపూరితం, విమర్శనాత్మకం అయిన స్లోగనులతో ఒక నాడు హరిజనవాడలో వెలిగిపోయి సదరు స్లోగనులు అధికార పార్టీయే అద్దెకి పుచ్చుకుని ఆ పైన సొంతం చేసేసుకొనగా ఏం చెయ్యాలో తెలియక తెల్లముఖం వేసుకుని ప్రజలకు కనిపించకుండా సేవ రద్దం పెట్టుకున్న కామ్రేడ్ రాంజీ, కౌన్సిల్‌లో ప్రతిపాదించబడ్డ ప్రతి బిల్లుకు తలో, తోకో తగిలించాలని తాపత్రయపడే అపోజిషన్ గ్రూపు లీడరు గుప్తా, ఊక బస్తాల్ని గోడౌన్స్‌లో ఉంచి ఓ శుభ అర్ధరాత్రి సమయంలో అగ్గిపుల్ల గీసి అగ్నిప్రమాదం పేరిట ఇన్‌ష్యూరు డబ్బు రాబట్టుకున్న ఇమాన్యుయల్, సాదువు 'ప్రగతికి ఆటపట్టు — రాబడికి మొదటి మెట్టు' అని నమ్మి నిత్యావసరాలైన సరుకుల్ని చీకట్లో స్టాకు చేసి వెలుగులో వేలుగా మార్చుకున్న షావుకారు సత్యం, గత జన్మలో జలగలుగా జన్మించి శాపవశాన వర్తమాన జన్మలో ఫుడ్ కార్పొరేషన్ క్వాలిటీ ఇన్‌స్పెక్టరుగా, ఇన్‌కంటాక్సు పెద్ద ఆఫీసరుగా, బుల్లి ఆఫీసరుగా అవతారాలెత్తిన సింహాచలం, తిరపతి, భద్రాదులు, చిట్ ఫండ్ స్కీములో గడించిన కట్నలతో ప్లాట్ల బిజినెస్ చేసే చిదంబరం, పిల్లల హాస్టలు నడుపుతూ పది లారీలు నెన కేసుకున్న పెరుమాళ్ళు, ఆక్రమించుకున్న స్థలాలకు పట్టాలు రాసి ఇవ్వటం గారంటీ అని గ్రహించి తన భూమికి లెఫ్ట రైటూ వదేసి ఎకరాలు కలుపుకుని బంజరును బంగారంగా మార్చి దేశ ఉత్పత్తిని పెంచాలని నడుము కట్టిన నాయుడు, సాహిత్యంలో ఓనమాలు తెలియకపోయినా ప్రతి కవి సమ్మేళనానికీ అధ్యక్షత వహించి బమ్మెర పోతనామాత్యుడు భారతం ఎంత భక్తిపూరితంగా వ్రాశాడో వివరించ ప్రయత్నించే శ్రీ పరశురామం, స్త్రీ జనోద్ధరణే తన జీవితాశయంగా భావించే సోషల్ వర్కర్ 'లేడీ కరుణాకరం', రిజర్వేషన్లు లేని క్లాస్ వన్ షెడ్యూల్డ్ క్లాసుకు ప్రాతినిధ్యం వహించే సుబ్రహ్మణ్య శాస్త్రిగారు, మాలగూడాన్ని తన తాటి మీద తెగకుండా నడిపించే ఫాదర్ మిసో నైటు, రక్షణ నిధికి, తుఫాను బాధితులకు, వరద బాధితులకు, సంక్షేమ కార్యక్రమాలకి, సన్మాన సభలకి, నాట్య ప్రదర్శనాలకి చందాలు వసూలుచేసే సాక్కుమా, అధికారాన్నీ హస్తగతం చేసుకుని మెయిన్ రోడ్డు పక్క సందులో తల ఎత్తి చూసేటంతటి లోగి లేసుకున్న చంద్రరావ్, నలుపును తెలుపుగా మార్చి, చీకటిని వెన్నెలగా చేసేసి చెవులతో వాదాలు విని, న్యాయాన్ని పంచే న్యాయస్థానంలో నరపతి సంపాదించి అమాయకులకు అరదండాలు తగిలించటమే వృత్తిగా గల ప్లీడరు ప్రకాశం వగైరా లాంటి పెద్దలకు ప్రత్యేకాహ్వానాలు వెళ్లాయి. కాఫీహోటల్ ముందు వేళ్లాడదీయబడే 'ఈ రోజు స్పెషల్' మెను బోర్డులా ఇన్విటేషన్ కార్డు వెనక 'మందు పార్టీ మీకు ప్రత్యేకం' అని కూడా కొంత మందికి వ్రాయబడింది.

పైన చెప్పబడ్డ పూజ్య పురుషులకే కాకుండా పెద్దలు విభజించిన పంచవర్ణాల పగటు మనుషులకి, సగం మనుషులకి విందు ఆహ్వానాలు వెళ్లాయి. అనుకున్న రోజు రానే వచ్చింది. ప్రజలు కన్నులు కాసేలా ఎదురుచూసిన విందు రోజు కళ్లముందు నిలిచింది. ఛెయిర్మన్ గారి బంగళా ప్రాంగణం పున్నమి చంద్రుని వెన్నెలంత తీవితో మెరిసిపోతూంది. బారులు తీరిన కారులు, వరసలో నిలిచిన వాహనాలు పరిసరాల్ని పూర్తిగా ఆక్రమించుకున్నాయి. ఆన్నాదానికి గేటువద్ద ఉంచిన బాండు మేళం కమ్మని నాదంతో స్వాగతం పలుకుతూంది. ఊరు ఊరంతా విందుకు తరలి వచ్చింది.

కోటేశ్వరరావుగారి బిల్డింగులో పన్నెండు గదులు పూర్తిగా డైనింగ్ టేబుల్స్‌తో నింపారు. కూర్చుని ఆరగించేందుకు వీలుగా కుషన్లు అమర్చారు. టేబుల్స్ మీద తెల్లటి రెసిడ్యూ రిమూవర్ కార్డుబోర్డు దట్టించారు. నవనవలాడే లేత అరిటాకులను పన్నీటిలో కడిగి ఒక్కో టేబులుమీద పట్టేనన్ని పెట్టారు. పెళ్లి భోజనాలలో మాదిరిగా ప్రతి ఆకును సువాసన చిందే అగరు వత్తులతో అలంకరించారు. అరిటాకుల మీద నిలిచి తళతళలాడే నీటి చుక్కలు పాలలో కడిగిన ముత్యాల్లా మెరుస్తున్నాయి. ధవళ వస్త్రాల్లో చూడ ముచ్చటైన రూపాలతో వడ్డించేందుకు నియమించబడ్డ మనుషులు వడ్డనలు పూర్తిచేశారు. చూడగానే పచ్చగా మెరుస్తూ నోట్లో ఉంచుకోవాలని ఆత్రత పెట్టే మైసూరు పాకు, అరచేత్తో అదిమి అమృతం ఉండలుగా మార్చారా అనిపించే రవ్వుండలు, సంపంగి పువ్వుల్లా ముట్టుకుంటే మెత్తబడి పాకాన్ని వెలికురికించే గులాబీ జిలేబీ, చూడగానే చవులూరించి,చిదపగానే వింతగా విరిగి, నోట ఉంచగానే కరిగిపోయే పంచదార కొబ్బరుండలు ఆకుల్లో తమ స్థానాల్ని తీసుకున్నాయి. పెద్దసల్లి మసాలాలో ముంచెత్తిన బంగాళా దుంప కూర, నవనవలాడే లేలం కాయలను కాయలు పళంగా కారం కూరి వండిన వంకాయ కూర, పలచటి రేకులుగా తరిగి రుచి చెడకుండా ఎర్రగా వేయించి వేడివేడిగా ఉంచిన దొండకాయ వేపుడు ఆకుల అంచుల్ని కాపలా కాస్తున్నాయి. ముక్కులో పొగలు లేపే ఘాటు ఘాటు కొత్త ఆవకాయ, వెల్లుల్లి గుంటూరు గోంగూర పచ్చడి, చిక్కటి పెరుగును చిలికి లేత కొబ్బరిని తరిగి సమపాళ్లలో పచ్చిమిర్చి చేర్చి అతి రుచికరంగా తయారుచేయబడ్డ కొబ్బరికాయ పెరుగు పచ్చడి చూసరులను ఆకుమీద పడి లంఫట్ చేసేందుకు ఆహ్వానిస్తున్నాయి. మధ్యలో ఉంచిన తెల్లటి సన్న బియ్యపు అన్నం మచ్చ లేని చంద్రుడులా ముచ్చటగా మెరుస్తూంది. ప్రతి టేబులు మధ్య స్టీలు బేసిన్‌లో మారు వడ్డించేందుకు వీలుగా మైసూరు పాకు, రవ్వుండలు, కొబ్బరుండలు, జిలేబీ



విందు ఆహ్వానం

ఫోటో—శ్రీ. కృష్ణమూర్తి రావు ([illegible])

ఉంచారు. కూరల వున్నం పాత్రల్లో కూరలు అమర్చారు. పెద్ద పెద్ద స్టీలు గిన్నెలలో పప్పులు పెట్టారు. ఇవి కాకుండా ముట్టుకుంటే వెయ్యి చేతికి అంటుకునే విధంగా వండిన వెజిటబుల్ పలావు, పులిహోర స్టీలు పళ్ళాల్లో ఉంచారు. అమృతపాణి అరటిపండ్ల అల్మార్లి శంఖు ఆకారంలో పేర్చారు. గడ్డ పెరుగును ప్లాస్టిక్ బకెట్లలో నింపారు. ఇవన్నీ వడ్డించేందుకు వీలుగా టేబులు కో మనిషిని పంచారు. చల్లటి మంచినీరు శుభ్రమైన గాజు గ్లాసుల్లో పోశారు. టేబుల్ సాల్టు పాకెట్లు టేబులు కొకటి కేటాయించారు. పొగుగా న్యాప్కిన్లు పోసి అవసరానికి వాడుకోమన్నారు.

బిల్డింగు బయట ఆవరణలో ఆకాశమంత తాటాకు పందిరి వేశారు. నీళ్లలో నానిన పచ్చి తాటాకు వాసన పల్లెటూర్లలో తామరాకుల్లో ఉంచే వేడి వేడి ఇడ్లీ వాసనలా ఉంది. పందిట్లో అలగాజనానికి ఆకులు పరిచి పెద్దవారి కోసం చేసిన ప్రత్యేకాలతో సహా వడ్డించారు.

కోటేశ్వరరావుగారు మడత నలగని మల్లెపువ్వుల్లాంటి వస్త్రాల్లో గేటు ముందు నిలిచి, కుడి ఎడమల భూషణం, శేషేంద్రం మెరుస్తూండగా ఆహ్వానితులకు స్వాగతం పలుకుతున్నారు. అతిథులు డబ్బుపెట్టి కొనుక్కున్న హుందాతో, అందాలతో మరింత శోభాయమానంగా అలంకరించుకుని, దివినుంచి రంభా నృత్య ప్రదర్శనకు దేవేంద్రలోకం ఏతెంచే అనిమిషుల్లా పుష్పక విమానాల్లోంచి దిగటం మొదలు పెట్టారు. ఏతెంచిన ప్రతి ఒక్కర్నీ చిరునవ్వుతో ఎదుర్కొని, ఆప్యాయంగా కౌగిలించుకుని క్షేమ సమాచారాలు అడుగటం కోటేశ్వరరావుగారి వంతు. వారిని సాదరంగా లోనికి తోడ్కొనిపోయి వారికి కేటాయించిన సీట్లలో కూచేయటం శేషేంద్రం, భూషణంల వంతు.

ఏ పెళ్ళిళ్ళైనా కొన్ని విషయాల్ని నిశితంగా పరిశీలించి, వాట్ల ఫలితాన్ని అంచనా కట్టి తూకంవేసి మరీ కేటాయించటం జరుగుతుంది. కాటా ఎటు తేలేది కేటాయింపైన కొద్ది కాలం తరవాత గాని తెలియదు. అందుకే ఎన్నికల్లో ఢీకొనేవి అయితే రెండు మృగరాజాలవుతాయి. కాకపోతే ఐరావతాలవుతాయి. లేకుంటే భల్లూకాలవుతాయి. అంతేగాని సాధారణంగా పోటీ రెండు తెగల మధ్య ఉండదు.

విందు టేబుల్సు వద్ద సీట్ల కేటాయింపులో కూడా శేషేంద్రం, భూషణం తగు జాగ్రత్తలు తీసుకున్నారు. బాంక్ లోను తీసుకుని దివాలా బోర్డు తగిలించిన పావకాల్లాంటి జెంటిల్‌మెన్‌లను, లోను ఇప్పించిన సదరు బాంక్ ఏజెంటుగార్ని ఓ టేబుల్ వద్ద కూర్చోపెట్టారు. రైస్ మిల్లు ఓనర్సుకూ, క్వాలిటీ ఇన్‌స్పెక్టరుకూ, గ్రెయిన్ పర్చేజింగ్ ఆఫీసరుకూ, ఫుడ్ ఇన్‌స్పెక్టరుకూ ఓ టేబులు రిజర్వు చేశారు. వర్తకులకూ, ఇన్‌కమ్ టాక్సు ఆఫీసర్లకూ ఓ చోట, మొఖాసాదారులకూ, భూస్వాములకూ రెవెన్యూ అధికార్లకూ ఓ చోట, ఇన్‌ష్యూరెన్సు శాల్తీలకూ, డాక్టర్లకూ ఓ చోట, వ్యోమేశ్వరరావు, చంద్రారావ్, హాస్టల్ అధికారి, హెడ్మాస్టరు, సబిన్‌స్పెక్టరుకు ఓ చోట— ప్లీడర్లకు ఓ చోట విందు విడిది ఏర్పాటు చేశారు. ఈ విధంగా ఏర్పాటు చేయటంలో గొప్ప రాజకీయం ఉంది.

పరీక్ష హాల్లో ఇన్విజిలేటరు విద్యార్థి వెనక నిలిచి వ్రాసేది పరిశీలిస్తే, ఆ విద్యార్థి కలం ముందుకు సాగదు. అవసరమైన అధికారులు దిష్టిబొమ్మల్లా ముందు తిష్ఠవేస్తే అధికార్లతో అవసరమున్నవారు ఆకులు ఖాళీచెయ్యటానికి మొహమాటపడి జంకుతారు. అవసరాలు తీర్చే శ్రీమంతులు ముందు లేకితనంగా ఆకుల మీదికి ఎగబడితే, పనులలోనే కాకుండా ప్రాక్టికల్ తిండిలో కూడా తమది మింగుడు స్వభావమనే అనుమానాన్ని వాళ్ళ సిద్ధాంతంగా రూపొందించుకుంటారని అధికార్లూ మొహమాటపడతారు. ఫలితంగా ఆకులు అజిటేష్‌గా మిగులుతాయి. అదీకాక సమాన స్థాయిలో సమాజంలో వెలుగుతున్న ఒకే రాంకు వ్యక్తులు ఒక చోట చేరితే ఓహో అంటే ఓహో అనుకుంటారే తప్పించి భుజాలు రాసుకుని బాతాఖానీలోకి దిగరు. కారణం? అన్నీ చిల్లపడ్డ సంచీలూ, ఒకే గూటి గురువిందలూ కాబట్టి.

విందు సంరంభం ప్రారంభమైంది. ఓటుకుండలకి, ఒట్టి కుండలకి మోత ఎక్కువట! కోటేశ్వరరావుగారి బృందం ఊహించినట్టు ఇళ్లవద్ద అపురూపులమని లోడ్ చేసేవాళ్లు మొహమాటంగా పదార్థాల్ని ముట్టుకుని, నమిలితే నోరెక్కడ కందిపోతుందనో సున్నితంగా ముద్ద ముప్పైసార్లు తక్కువ కాకుండా నములుతున్నారు. మధ్య మధ్యలో కొందరు — పక్కా పట్నం బాబుల్లా తమని మార్చుకుని అర్థంకాని ఇంగ్లీషు సినిమాని ఫాషన్‌కోసం చూస్తూ పది మంది నవ్వితే ఆ జోకేదో అర్థమైనంత గాభరాలో కోరస్ కలిపే పల్లెటూరి గబ్బిలాల్లా తెలియని సబ్జెక్టుల్లో తామెరిగిన రెండు మూడు ముక్కలు వెళ్లగక్కి పాండిత్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఎవరు సంభాషణ దేనితో మొదలుపెట్టినా, అది ప్రయాణించి చిట్టచివరికి చెయిర్మన్‌గారు ఆ విందు ఎందుకిస్తున్నారు అనే విషయం వద్దకు వచ్చి ఆగిపోతూంది. ఆహ్వానితులందరూ రావటం పూర్తికాగానే చెయిర్మన్‌గారు ఒక్కో గదిలో కెళ్లి ఆరగిస్తున్న ఆహ్వానితులను పలకరించి, మరీ ఆప్యాయం ఎక్కువ కురిపించవలసిన మనుషులకి లాంఛనంగా సదరు శాల్తీలు చేతులూపి, తలకాయలు. [illegible] కింద పడేలా వద్దని గ్రుడ్లు తిప్పుతున్నా వినక స్వీట్లు వడ్డించారు.

పన్నెండు గదులు పర్యటించి అతిథుల్ని మీటింగు కోసం మేడమీదికి రమ్మని మేడెక్కారు. మేడ మీద కరెంటు లేదు. పెట్రొమాక్సు లైట్ల సహాయంతో భూషణం, శేషేంద్రంలు మీటింగుకోసం మేడమీద కుర్చీలు పేరుస్తున్నారు. అలగాజనంకోసం బరకాలు పరిచారు. చిన్నసైజు వేదిక ఎత్తుగా ఏర్పాటు చేశారు. పెట్రొమాక్సు లైట్ల కాంతిలో మేడ చీకటి చీకటిగా మెరుస్తూంది. చల్లటి గాలులు మనస్సు వరకూ వీచి ప్రశాంత సంగీతంతో జోకొడుతున్నాయి. వెన్నెలలో ఎంత వేడి ఉంటుందో, చీకట్లో అంత చల్లదనం ఉంటుంది కాబోలు! దూరంగా కొళాయి చెరువు కదలిక లేక చీకటి ఉండలా ముద్దచుట్టుకుని ఐదో ఝాము నిద్దరహో ఉంది. కాపలా కాసే గూర్ఖా గుడిసెలో దీపం నిశ్చలంగా నిలబడి నిండుగా నవ్వుతూంది.

సమావేశపు సర్దటాలు అయ్యాయి.


“మరి మేం వెళతాం అండీ.” శేషేంద్రం కోటేశ్వరరావుగారితో అన్నాడు.

“వెళ్ళండి. వెళ్లి మీటింగయ్యేటప్పటికైనా రండి.” కోటేశ్వరరావుగారు అన్నారు.

“ఎంత? నిమిషాల్లో రామూ?” మాట అంటూ మెట్లు దిగారు వాళ్ళు.

ఇంతలో విందారగించిన వదనారవిందాలు చక్కెర కిళ్లీలు నములుతూ, నోళ్ళని విచ్చిన మందారాల్లా మార్చుకుని మేడమీద మీటింగుకు విచ్చేయసాగాయి. అందరి గుండెల్లో గూడు కట్టుకున్న ఆత్రత ఒకటే. కొడుకు ఉపనయనానికి, తండ్రి తద్దినానికి, కూతురు పెళ్లికి, పెళ్లాం పుట్టిన రోజుకు—మరి దేనికీ కూడా ఇవ్వని విందు నేడు ఇవ్వటంలో అంతర్యమేమిటి? ఏమిటి నేటి ప్రత్యేకత? ఇవ్వబడ్డ ఆ విందైనా అంతరింగికులకుమాత్రమే పరిమితం కాలేదు. ఊరంతటికి — బీదాబడా, సీదా సాదా, చిన్న పెద్ద గొప్ప— అందరికి సమానంగా వడ్డనలో భేదం లేకుండా, వంటలో తేడా రాకుండా తిన్నవాళ్లకి పీకెదాకా ఇవ్వబడింది. ఏమిటీ విపత్కర పరిస్థితి? ఇండియాలో సోషలిజం సాధించబడటం మ్యూరా?

అందరి మొహాల్లో ఆత్రతని గమనిస్తూ చిన్నసైజు వేదిక ఎక్కారు


ఎదురు చూపులు — ఫొటో—కె. సత్యనారాయణ (బరంపురం)


చైర్మన్ గారు. ఎక్కి చిన్న చిరునవ్వు నవ్వారు.

కారణజన్ములు కారణం లేకుండా నవ్వరు. నవ్వారంటే కారణం కోసం నవ్వుతారు. వాళ్ళ పిల్లలు ఝడుసుకునేలా నవ్వితే ప్రజలంతా గుండెల మీద చెయ్యేసుకుని గురక తియ్యవచ్చు. కాని, చిరునవ్వు నవ్వితే నిత్యం, నిమిష నిమిషం జాగ్రత్తలో ఉండాలి. ఉన్నవారి చిరునవ్వులు ఉపద్రవాన్ని సూచించే తోక చుక్కలు.

చైర్మన్ గారి చిరునవ్వుకు విందులో వడ్డించబడ్డ కొబ్బరుండలు ఎవరూ చూడకుండా కోటు జేబులో వేసుకుని ఇంటికెళ్ళగానే అమ్మకపు గాజు సీసాలో అమర్చి ఉండకి పదిహేను పైసల చొప్పున రూపాయివ్వర వెనకేయచ్చనుకున్న సెట్టి తన దొరతనం బయటపడిపోఖుందన్న ధీమాతో ఊలాపడిపోయాడు. జేబులో చేతులు పెట్టుకుని పైకి సీరియస్‌గా పోజేస్తూ విందులో సద్దిన స్వీట్స్ లెక్కబెట్టుకుంటున్న మరో పెద్ద మనిషి ఆయన చిరునవ్వుకు కంగారు పడిపోయి భుజాలు తడుముకోబోయి చొక్కా అడ్డమున్న కారణంగా దాన్నే తడుముకున్నాడు. ఎవరూ చూడకుండా పోగేసిన అయిదో కిళ్ళీ సీలు విప్పుతున్న మరో శాస్త్రి తన తమలపాకుల తంతు ఆయన కళ్ళలో పడి కొంపలు మునిగిపోయాయని నిశ్చయించేసుకున్నాడు. ఇలా ఎవరికి తోచిన భాష్యాన్ని వారు కోటేశ్వరరావుగారి చిరునవ్వుకు ఊహించుకుని, తదుపరి రంగులతో చిత్రించుకుని దానికి చిలవలు పలవలు చేర్చి మనసులో ముచ్చటించుకోవటం మొదలు పెట్టారు.

కోటేశ్వరరావు గారు చెదరలేదు. నవ్వటం మాననూలేదు. మరోసారి చిరునవ్వు నవ్వి కమ్మని కంఠం విప్పారు. ప్రజలు తమ చెవుల్ని తాత్కాలికంగా పాము చెవులుగా మార్చేసుకున్నారు. మిన్ను విరిగి మీద పడ్డా చెక్కు చెదరక నిలిచే నిశ్చలులను సహితం కలవరపెట్టే నిశ్శబ్దం పార్టీ ఇన్ పవరైంది.

"విందుకు విచ్చేసిన సోదరులారా, సోదరీమణులారా! నా కన్ని పనుల్లోనూ అండదండలుగా నిలిచి చెయ్యూత నిచ్చి నన్ను పైపైకి నడిపించే నా ప్రజలారా! నన్ను అనుక్షణం ఓ కంట కనిపెట్టే పుర ప్రముఖులారా! మీ కష్ట సుఖాల్ని నాకు వినిపించి మీలో ఒకడుగా నన్ను భావించే కార్మికులారా, కర్షకులారా! తదితర పెద్దలారా! ఆహ్వానించగానే విచ్చేసి నన్ను మన్నించి నా కోరిక తీర్చిన మీ కందరికీ నా వినయపూర్వక నమస్కారాలు.



ఈ నల్లని రాళ్ళలో... ఫోటో—ఎ. కామేశ్వరరావు

హృదయపూర్వక కృతజ్ఞతాభి వందనాలు." సభని సంబోధించి తలని నలు వైపులా తిప్పి ఉపన్యాసం మొదలు పెట్టారు కోటేశ్వరరావుగారు.

మేడ వెనక భాగంలో ఇంతవరకూ కదలిక లేక చీకటి ముద్దలా ఉండచుట్టుకుని అయిదో ఝామున నిద్దురలో ఉన్న కొళాయి చెరువు ఒక్క సారి ఆవలించి నిద్దుర లేచింది. నిశ్చలంగా నిలబడి నిండుగా నవ్వే కాపలా గూర్ఖా గుడిసెలో దీపం గతుక్కుమని రెపరెపలాడి కొండెక్కింది.

కోటేశ్వరరావుగారు తృప్తిగా నవ్వి ఉపన్యాసాన్ని కొనసాగించారు.

"నాకు తెలుసు—మీ రందరూ ఈ విందు ఇవ్వటంలో ఏదో ప్రత్యేకత ఉందని అనుకుంటున్నారని. కొంత మంది కారణాలు ఊహించుకొని, తమ కారణాలే రైటని పందాలు కాశారని వినికిడి. ఏది ఏమైనా నిజాన్ని ఒప్పుకోవటం నా విధ్యుక్త ధర్మం. మీ రందరూ ఊహించినట్టుగా, ఆశించినట్టుగా ఏదో ప్రత్యేక కారణం ఉండి నే నీ విందు ఇవ్వ లేదు. ఎన్నో రోజుల నుంచి మన ఊరి నోటిని నిండారా నింపాలని కలలు కన్నాను. అనుకోకుండా ఈ రోజు సాధ్యపడింది. ఈ విందులో ఏమైనా లోటుపాట్లు జరిగితే నన్ను క్షమించండి. ఈ విందుకు విచ్చేసిన మీ కందరికి మరోసారి కృతజ్ఞతలు తెలుపుకుంటూ సెలవు తీసుకుంటున్నాను... ఆఁ ... అన్నట్టు మేడ దిగి వెళ్ళేటప్పుడు కొంచెం చూసుకుని దిగండి. చీకటిలో కాలు జారితే ప్రమాదం. రెండు నెలల నుంచి మా మేడ మీద కరెంటు షాక్ కొడుతున్న కారణంగా కనెక్షన్ కత్తిరించేశాం. ఈ విషయంలో మీకు కలగజేసిన అసౌఖ్యానికి క్షమార్పణలు చెప్పుకోవటం నా విధి. సెలవ్."

హుందాగా వేదిక దిగిపోయారు కోటేశ్వరరావుగారు.

ప్రజలందరూ చప్పబడిపోయారు. చల్లారిపోయారు. చాలా నిరుత్సాహపడిపోయారు. ఎన్నెన్నో ఊహించుకున్న వారికి ఆశాభంగం మిగిలిపోయింది. నీరసంగా మెట్లు దిగటం మొదలు పెట్టారు.

ఇంతలో శేషేంద్రం, భూషణం వచ్చి కోటేశ్వరరావుగారి పక్కన నిలిచారు.

"అంతా సవ్యంగా జరిగింది కదూ?" చాలా సాదాగా ప్రశ్నించారు చైర్మన్ గారు.

"ఆఁ దాదాపు. కాని, ఓ చీమ అడ్డు పడి కుట్టబోయింది." శేషేంద్రం అన్నాడు.

"బహుశా బ్రహ్మదేవుడి శాపం మరిచిపోయి ఉంటుంది. మంచి మనుషుల్ని చంపాలని కుట్టే దురాశ చీమలు నిలువునా మాడిపోతాయి. అదే కదూ శాపం?" చైర్మన్ అడిగారు.

"అంతే." తృప్తిగా మెట్లు దిగి వెలుగులోకి వెళుతున్న ప్రజల్ని చూస్తూ అన్నాడు భూషణం.

తరవాత ప్రత్యేకాహ్వానితులకు మందు విందు జరిగింది. అది కూడా బ్రహ్మాండమైన సామాన్యంగానే ముగిసింది.

• • •

ఇంతటితో ఈ కథ కూడా ముగిసింది.

ముగిసిన ఈ కథకి ముందు ఓ తలా, వెనక ఓ తోకా తగిలించి దీన్ని కథ కాకుండా చేసే కుతూహలం, ఉద్దేశ్యం రచయితగా నాకు లేవు. కథ రాణించటానికి టానిక్కులా పనిచేసే రమణీయమైన కొసమెరుపు, ఆఖరి మలుపు, పాఠకుల్ని ఆకట్టుకుని కదలకుండా కట్టి పారేసే పదగుంభనము, చమత్కారం చిందే రుచికరమైన శైలి, పది కాలాలపాటు నిలిచే కొత్త కథా వస్తువు— వీటి గురించి నేను తాపత్రయ పడి ఎప్పుడూ కాగితాల్ని ఖరాబు చెయ్యలేదు. ఆ ఓపిక నాలో శూన్యం అనే సత్యాన్ని నేను తోసిపారేయను. అందుకే ఈ కథ గురించి ఇంక నేనేం చెప్పను.

అంతేకాదు.

చైర్మన్ కోటేశ్వరరావుగారు విందు ఇచ్చిన రాత్రి ఊరు ఊరంతా ఆనందంతో పండగ చేసుకుంటూ ఉయ్యాల లూగిన వేళ, అమాకీ తెలియని కొందరు వ్యక్తులు రాత్రికి రాత్రి పుష్కలంగా, ఆరోగ్యంగా పెరిగి లక్ష రూపాయలకు పాడబడ్డ పన్నెండు చెరువుల చేపల్ని నిమిషాల్లో లారీ లెక్కించి తెల్లారేసరికి సొమ్ము చేసుకున్నారన్న విషయంగాని, చేపలు పట్టేందుకు ప్రయత్నించిన దుండగుల దారుణాన్ని విధ్యుక్త ధర్మంతో ఎదుర్కొన్న గూర్ఖా మరునాడు ఉదయం పొత్తికడుపు మీద మూడు కత్తిపోట్లతో కొళాయి చెరువు గట్టున శవ రూపంలో దొరికాడని గాని చెప్పను. ఇవేమీ చెప్పకుండా మా ఊరి మ్యునిసిపాలిటీకి అతను చేసిన సేవలకి ప్రతిఫలంగా చైర్మన్‌గారు ఉదారంగా అతని సంసారానికి సానుభూతితో మ్యునిసిపాలిటీ తరఫున అయిదు వందల రూపాయలు ఇచ్చారని చెప్పటం అర్థంలేని విషయం కాబట్టి ఆ విషయం కూడా చెప్పదలుచుకోలేదు. ★